# పరిహారం

"బ్రతుకు బుగ్గి చేసిన సారా" కథల పోటీలో ఈ వారం ఎన్నికయిన కథ

## మహీధర




**తూరుపు తెలతెలవారుతోంది. పల్లె, పట్టణమూ కాని ఆ ఊరు అప్పుడే బద్ధకంగా ఒళ్ళు విరుచు కుంటోంది. శాంతకుమారి కంగా రుగా నిద్రలేచింది.** దేనికీ స్వేచ్ఛలేని బ్రతుకు. బాగా వెలుతురు వస్తే సిగ్గుపోతుంది. ఇరవై ఒకటవ శతాబ్దంలోకి అడుగు పెట్టిన దేశమిది. అయినా బహిర్భూమికి బహిర్భూమే తప్పని కొన్ని ఇళ్ళల్లో అదొకటి. పిచ్చి తుమ్మ కంపలోకి నడిచి బాధ తీర్చుకుని హాయిగా ఊపిరి పీలుస్తూ రొడ్డెక్కింది. రోడ్డు దాటిందో లేదో బలమైన హస్తం గట్టిగా నోరు మూసి డొంకల్లోకి లాక్కుపోయింది. పంట చేనుని పసరము తొక్కేసింది. పాలబుగ్గల పాపాయిని పాము కాటేసింది. పదిహేనేళ్ళ పడుచు శాంతకుమారి నగర శివార్లలో నివసిస్తూ, పత్తి చేలలో, మిరప తోటల్లో.. ఎక్కడ ఏ పూట పని దొరికితే ఆ పూట అక్కడే పని. కష్టం చేసుకు బ్రతకడానికి ఇష్టమైనప్పుడు లోటేమిటి? కానీ బతుకు చీకటయిపోయింది. కళ్ళు తుడుచు కుంటూ ఇంటిదారి పట్టింది.

ఎదురొచ్చిన సామ్రాజ్యం డేగచూపు శాంతను దాటిపోలేదు.

"ఏందే శాంతాలూ అట్టుండావ్! ఏం దయింది?" చూపులు గుచ్చాయి.

"ఏం లేదు పిన్నాయ్!" బొంగురుపోయిన శాంత గొంతు.

"జాకట్టట్లా చిరిగిందేందే? జుట్టు రేగింది" మరింత నిశితమైన పరిశీలన.

"ఇప్పుడేగందా నిద్ర లేచింది" శాంతకి

పదిహేనేళ్ళయినా లోకజ్ఞానం బయటపడనివ్వ లేదు. గబగబా నడిచింది. అవమానం శాంత నరనరాన నిండిపోయింది. నాజూగ్గా సాగా ల్సిన సృష్టికార్యం మొరటుదనం సంతరించు కుంది. జంతువులకు కూడా ఎదవడానికి కాలం అంటూ ఉంది. మనిషి ఇంత హీను దేమిటి? శాంత స్నానం చేసి సగం చీదర వదిలించుకుంది. మనసు పచ్చి పుండులా ఉంది. పశువులా మీద పడ్డాడు. ఆంబోతు కుమ్మినట్టు శరీరం అంతా పుండులా ఉంది. ఏం చెయ్యాలి? ఎవరికి చెప్పినా రబసవు తుంది. తనకి న్యాయం జరిగేదెలా? ఏం చెయ్యాలి? ఆలోచనలతో ముడుచుకుపోయింది శాంత.

"ఓసేయ్ శాంతాలూ రాయే! నేను నిన్ను పెళ్ళాడాల. కుక్క ముట్టిన కుండవే!" తాగిన మైకంలో తానే ఆ కుక్కనని మరిచిపోయి సింహాద్రి బయట కేకలుపెడుతున్నాడు.

శాంత గుండె గుబగుబలాడిపోయింది. చేసిన పని చాలక నడిబజారుకీడుస్తున్నాడు చచ్చినోడు. శాంత తల్లి గబగబా బయటి కొచ్చింది.

"ఓ అత్తమ్మా! ఏదే నీ కూతురు నాతో పంపే! ఎవరికీ అది పనికిరాదు" తాగుబోతు వాగుడు.

"పోరా చచ్చినోడా! ఎదవ వాగుడు వాగమాక" ఛీత్కరించింది.

ఫెళ్ళున నవ్వాడు.

"నీ కూతుర్నదుగే దాన్ని నేను..." ఫెళ్ళున నవ్వాడు.

తల్లి గుండె గుబగుబలాడింది. లోపలి కెళ్ళింది. శాంత ఓ మూల కూర్చుని కుళ్ళికుళ్ళి ఏడుస్తోంది.

"ఏయ్! ఆ తాగుబోతెదవ చెప్పింది నిజమేనా?" ఉగ్రరూపం దాల్చింది.

శాంత ఏడుస్తూనే అంతా చెప్పింది. శాంతను ఈడ్చుకెళుతూ సింహాద్రి ముందు కూలేసింది.

"ఇదుగోరా సచ్చినోడా! తాళి కట్టి ఏలుకో. ఇది ఇంక నాకు పుట్టలేదనుకుంటాను" భళ్ళున తలుపేసింది.

శాంత బిక్కసచ్చిపోయి గుమ్మంలోనే కూర్చుండిపోయింది. ఎక్కడ పొంచి ఉందో సామ్రాజ్యం రయ్యిన వచ్చేసింది.

## సారా మైకం



బ్రతుకు బుగ్గి చేసిన
సారా సారా
తిడుతున్నాను మనసారా
అమ్మేవాడు చిన్నవాడు
అమ్మమన్నవాడు పెద్దవాడు
నిప్పుల్లోకి దూకేవాడివి నువ్వే
కిక్కు ఇస్తుందంటావు
క్లిక్కయిందంటావు
కిక్కురుమనకుండా చస్తావు
డబ్బుల వేటలో
పెళ్ళాం పుస్తెలు తణఖా
తాగిన మైకంలో
పిల్లల జీవితం తణఖా
నువ్వు గుండాగి చస్తే
నీ కుటుంబం రోడ్డు మీదకు
నీ పరువు బజార్లోకి...........

– జి. విజయశ్రీ

"ఇదెవడికి ఒళ్ళప్పగించిందో! పొద్దునే చూసా! నంగనాచి కబుర్లు చెప్పింది. ఇది నాకు కోడలేమిటి? పోరా సచ్చినోడా. తాగి తాగి తెగబలిసి చస్తున్నావ్ పో!"

"ఏందే పోయేది! నీయమ్మ. నేను...

ఇది నాదేనే ఓసి నీయమ్మ. నీ మిండగాణ్ణడుగు" తూలిపోతూ ప్రేలాపన. తాగినోడికి తల్లీ లేదు, చెల్లీ లేదు.

తాగుబోతు ప్రేలాపనకు జనం పోగ య్యారు. శాంత తలెత్తలేదు. తల్లి తలుపు తియ్యలేదు. ఇతరులకు తీర్పు చెప్పడమంటే జనానికెంత ఇష్టమో!

"ఓ ఐదొందలు ఇచ్చేయ్ సాంబ్రాజ్యం. నీ కొడుకు ఎదవపని చేశానని చెబుతున్నాడు గందా!" ఓ ఉదార స్వభావి ఉవాచ.

"ఐదొందలేనా? ఆడు చేసిన పాడు పనికి?" అంతేకాని డబ్బుల్తో వెలకట్టలేనివి వుంటాయని అక్కడున్న ఎవరూ అనలేదు.

"ఆ ఏంది? ఐదు నిమిషాల పనికి ఐదొం దలు జాల్లే..." ఎవరో కిసుక్కున నవ్వారు.

గుండెల్లో గునపం దిగినట్లయింది. రేపట్నుంచి ఐదొందలు పట్టుకొచ్చిన ప్రతెదవా ఈ గుమ్మం ఎక్కొచ్చు. అన్నిటికన్నా ఇదెక్కువ బాధ అనిపించింది శాంతకి. రివ్వున లేచింది. కను మూసి కను తెరిచేంతలో ఎదురుగా ఉన్న మోటబావిలోకి దూకేసింది. వర్గాన్ని బట్టి మానభంగాలకి కూడా రేటు కడతారని తెలియని పసిది శాంత. ←

ఈ రచయితకు బహుమతి సొమ్ము త్వరలోనే అందజేయబడుతుంది.

– ఎడిటర్

